ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ టిఎస్. చేతన్

టెలీకాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని అలాగే వర్షాలకు పంట నష్టం జరిగి ఉంటే వాటి వివరాలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ టెలికాన్ఫరెన్స్ లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కర్నాటకలోని పావగడ, తుముకూరు, బళ్లారి తదితర ప్రాంతాల్లో అధిక వర్షం కురిసిందని జిల్లాలో రొద్దం, రొళ్ల, మడకశిర ప్రాంతాల్లో అధికంగా వర్షం కురిసినట్లు నివేదికలు అందాయని అన్నారు. జిల్లాలో ఎక్కడ వర్షం నీరు నిలువ ఉండకుండా పంచాయతీరాజ్, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులు ఎక్కడ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైపులలో వర్షం నీరు చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు కాచి వడబోసిన నీరు తాగాలని అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ వారు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ మలాదిన్ స్ప్రే చేయాలన్నారు. సంబంధిత అధికారులు పంట నష్ట వివరాలు, గృహ నిర్మాణ శాఖ, విద్యుత్, రహదారుల నష్టంపై నివేదికలు ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని 08555292432 నెంబర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు : వాతావరణం శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో సోమవారం ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నామని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సోమవారం సెలవు ప్రకటించినందున పాఠశాలలు తెరవద్దని కలెక్టర్ సంబంధిత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క పాఠశాలను నడపరాదని విధిగా సెలవు పాటించాలని కలెక్టర్ కోరారు.

కలల సౌధం సాకారమయ్యేనా..?

కదలిక లేని స్మార్ట్ టౌన్‌షిప్
ఆందోళనలో దరఖాస్తుదారులు
డబ్బు వెనక్కివ్వాలని వేడుకోలు

ప్రజాశక్తి-పెనుకొండ

'మధ్యతరగతి కుటుంబాల కోసం లాభాపేక్ష లేకుండా అందుబాటు ధరల్లో లేఅవుట్లు తీసుకొస్తున్నాం. మొదటి దశలో ఆరు చోట్ల అభివృద్ధి చేస్తున్నాం..ప్రతి నియోజవకర్గలోనూ ఏర్పాటు చేసి మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయబోతున్నాం. లేఅవుట్‌లో 50శాతం స్థలాన్ని సార్కులు, స్కూళ్లు, క్రీడా మైదానాలు, బ్యాంకులు, షాపింగ్, రిక్రియేషన్ సదుపాయాల కోసం కేటాయిస్తాం. విశాలమైన 60 అడుగుల బీటీరోడ్లు, 40 అడుగుల సిమెంట్ రోడ్లు, కలర్ టైల్స్‌తో పుట్‌పాత్‌లు, రోడ్ల కిరువైపులా మొక్కలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా, యూజీడీ, వరద నీటి కాలువలు ఉంటాయి'. 2022 జనవరి 11న జగనన్న స్మార్ట్ టౌన్‌షిఫ్ వెబ్‌సైట్ ప్రారంభించిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలివి.

మధ్యతరగతి కుటుంబాలకు అరచేతిలో సొంతింటిని చూపించిన అప్పటి ప్రభుత్వం వారి కలలను కల్లలు చేసింది. అదిగో..ఇదిగో అంటూ హడావుడి చేసి ఉసూరుమనిపించింది. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల్లోని ప్లాట్ ధరలో పదిశాతాన్ని దరఖాస్తుదారుల నుంచి వసూలు చేసిన అప్పటి జగనన్న సర్కారు వారికి స్థలాలను అప్పగిందించనేలేదు. లేఅవుట్లలో విశాలమైన తారు, సిమెంట్ రోడ్లు కాదుకదా.. కనీస సదుపాయలూ కనబడటంలేదు. కొన్ని చోట్ల లేఅవుట్లు వేసి ప్లాట్లు కేటాయిస్తే, మరికొన్ని పట్టణాల్లో స్థలం సేకరించి కరపత్రాల్లో మాత్రమే పాట్లు కనపడుతున్నాయి.

జిల్లాలో ఆరు టౌన్‌షిప్‌లు...

శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. ఈ ఆరు టౌన్‌షిప్‌ల పరిధిలో 2,781 దరఖాస్తులు వచ్చాయి. అందులో దాదాపుగా 1700 నుంచి1800 ప్లాట్లు ప్రభుత్వం కేటాయించింది. ధర్మవరం, కోడూరు, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరిల్లో టౌన్‌షిప్‌లున్నాయి. ఇందులో ధర్మవరంలో 1147 పాట్లు, కోడూరులో 133పాట్లు, పెనుకొండలో 290పాట్లు, మడకశిరలో 123పాట్లతో స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పుట్టపర్తిలో ప్లాట్ల కేటాయింపులులేవు, కదిరిలో భూసేకరణ కాలేదు.

ఆందోళనలో దరఖాస్తుదారులు

అప్పటి ప్రభుత్వం అనుకున్న సమయానికి దరఖాస్తుదారులకు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేకపోయింది. కూటమిప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎంఐజీ లేఅవుట్ల విషయంలో ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో డబ్బు చెల్లించిన దరఖాస్తు దారులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు వారు చెల్లించిన 10శాతం డబ్బును తిరిగి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం దరఖాస్తు దారులకు ప్లాట్లు ఇస్తోందో ఇవ్వదో అనే అనుమానంతో కొందరు అసలు ఈ పథకమే రద్దు చేస్తుందని మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న వైఎస్ 'స్వగృహ' భయం...

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు కోసం డబ్బులు చెల్లించిన మధ్యతరగతి వారెందరో ఇబ్బందులు పడ్డారు. ప్రాజెక్టు పూర్తికాక ఇటు డబ్బులూ వెనక్కి రాక అష్ట కష్టాలు పడ్డారు. జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని పెనుకొండ లేఅవుట్‌లో డబ్బు కట్టిన ఒకరు అభిప్రాయపడ్డారు. సంవత్సరాలు గడుస్తున్నా సదుపాయాలు కల్పించి రిజిస్ట్రేషన్ చేయించకపోవడాన్ని ఏమనుకోవాలని దరాఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి:

కూటమి ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు న్యాయం చేయాలని ఎంఐజీ పథకంలో ప్లాటు కోసం దరఖాస్తు చేసుకున్న పెనుకొండకు చెందిన జనార్ధన్‌రెడ్డి కోరారు. ఎంతో ఆశతో సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు రెండో వాయిదా డబ్బు చెల్లించామని, లేఅవుట్‌లో కనీసం భూమి చదును కూడా చేయనేలేదని వాపోయారు. ప్రభుత్వం మారడంతో ఎంఐజీ లేఅవుట్లు అభివృద్ధికి నోచుకోవన్న అనుమానులున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం లేవుట్లను అభివృద్ధిచేసి రిజిస్ట్రేషన్లు చేయించాలని కోరారు.

మంత్రి స్పందించాలి

మధ్యతరగతి వర్గాల సొంతింటిక నెర వేర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. గత ప్రభుత్వం చేపట్టిన ఎంఐజీ లేఅవుట్లను పూర్తిగా అభివృద్ధి చేసి దరఖాస్తు దారులకు అప్పగించాలి. పెనుకొండలో ఇప్పటికీ భూమి చదును చేయనేలేదు. స్థానిక మంత్రి సవిత ఈ విషయంపై స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

హరి,
సిపిఎం నాయకులు

పెనుకొండలో స్మార్ట్ టౌన్‌షిప్‌కు కేటాయించిన స్థలం

నామినేటెడ్ పదవుల్లో బలిజలకు ప్రాధాన్యమివ్వాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో బలిజ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించా లని పలువురు ఆ సామాజిక వర్గం నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధం కావడంతో ఆ పదవులు ఆశించే నాయకుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే ఎంతోమంది వివిధ సామాజిక వర్గాలకు చెందిన టిడిపి నాయకులు అగ్రనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ముఖ్యంగా పుట్టపర్తి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(పుడా) పీఠం కోసం పలువురు నేతలు తమదైన శైలిలో ప్రయ త్నాలు చేస్తున్నారు. పుట్టపర్తి మండలంలోని ఎనుములపల్లి గ్రామానికి చెందిన యువ నాయకులు చింతా దామోదర్ 20 ఏళ్లుగా టిడిపి కోసం అంకితభావంతో పని చేస్తున్నారు. ఆయన పుడా ఛైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని ఆ సామాజిక వర్గం నాయకులు సైతం ఆయనకు పుడా పదవి కేటాయించాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఎంతో మంది బలిజ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఉన్నారు. వారికి నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఆ సంఘ నాయకులు కోరుతున్నారు. బుక్కపట్నం మండలంలో దాసరి శీను, నల్లమాడలో మైలే శివశంకర్, ఒడిసిలో జయచంద్ర, కొత్తచెరువు మండలంలో సంజీవ రాయుడు, రఘుపతి, రామకృష్ణ, సోము, అమడుగూరు మండలంలో కృష్ణమూర్తి, గోపాల్, శ్రీనివాసులు, పుట్టపర్తి మండలంలో చింతా దామోదర్, దాసరి శంకర్, తోట్ల గంగాధర్, సుబ్బారావు, మారుతి తదితరులు టిడిపి కోసం పని చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా వైసిపి ప్రభుత్వానికి దీటుగా, పలు కేసులను ఎదుర్కొని గట్టిగా నిలబడి ఉన్న బలిజ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని పలువురు అధిష్టానాన్ని కోరుతున్నారు.

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి -అనంతపురం

అధిక వర్షాలు పడుతున్న కారణంగా అనంతపురం విశ్వ విద్యాలయం పరిధిలో సెప్టెంబర్ 2వ తేదీ జరగాల్సిన అన్ని.పరీక్షలను అనంతపురం జెఎన్‌టియు పరీక్షల విభాగాధిపతి ఆచార్య నాగ ప్రసాద్ నాయుడు తెలిపారు. అధిక వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పరీక్షలను వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు. పరీక్షల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని ఆయన అన్నారు.

యథేచ్ఛగా కర్నాటక మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - అగళి

మండలంలో కర్నాటక మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. అగళి మండలం కర్నాటక సరిహద్దున ఉంది.తుమకూరు జిల్లా సిరా తాలూకాకు మూడు వైపులా ఆనుకుని ఉన్న ఈ మండలంలోకి చుట్టుపక్కల ఉన్న సిర, మధుగిరి తాలూకాలోని బార్డర్ నుంచి కర్నాటక మద్యాన్ని తీసుకువచ్చి భారీగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఒక బాటిల్‌కు రూ. 30 నుండి 40 రూపాయల వరకు లాభాలకు విక్రయిస్తున్నారు. మండలంలోని ఆలూడి 'కోడిపల్లి', నరసంభూదిచ బ్యాడిగిరచ పూలపల్లిచ అగళిచ రాగే లింగనపల్లి తదితర గ్రామాల్లో జోరుగా కర్నాటక మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఈ తతంగాన్ని పోలీసు యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఆయా గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండటంతో మద్యంప్రియుల ఆగడాలు ఎక్కువయ్యాయయని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మద్యం అక్రమ అమ్మకాలను నిరోధించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి మహేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని అప్ గ్రేడ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడారు. రూరల్ మండలం పారిశ్రామిక వాడ ప్రాంతంలో విచ్చల విడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు వచ్చిన సమచారం మేరకు సిఐ ఆంజినేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. గోళాపురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో జోగిందర్ ప్రసాద్, షేక్ వసీం అనే ఇద్దరిని అరెస్టు చేసి, వీరి వద్ద ఉన్న గంజాయి, సెల్ ఫోన్లను సీజ్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

దారి దోపిడీదారులు అరెస్టు

హిందూపురం రూరల్ మండల ప్రాంతంలోని పారిశ్రామిక వాడలో ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వారి వద్ద ఉన్న డబ్బులు, నగదును దోచుకెళ్లే ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుండి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి మహేష్ వెల్లడించారు. గత నెల 23న సుజాత ఫ్యాక్టరీ సమీపంలో ఒంటరిగా ఉన్న వ్యక్తిని తీవ్రంగా గాయపరిచి అతని వద్ద నుండి మొబైల్ ఫోన్‌ను లాక్కొని పోయినట్లు బాదితుడు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో పాటు గత కొంత కాలంగా పారిశ్రామిక వాడలో దారి దోపిడిలు ఎక్కువ అయినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దాడులు నిర్వహించామన్నారు. శనివారం గోళాపురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన మహమ్మద్ ముజాహిద్, షేక్ అబూబకర్ సిద్ధిక్ లు అనుమాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరం అంగీకరించారన్నారు. వారి నుండి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ సీజ్ చేసి అరెస్టు చేసి, రిమాండుకు తరలించామన్నారు.

'పురం'లో స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో స్థానిక టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు చిన్న మార్కెట్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ మాట్లాడుతు సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలో కూడా బాలయ్య ఉన్నత స్థానానికి చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జేపీకే రాము, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు హిదాయతుల్లా, పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు మూర్తి, పాండు, ఆటో సంజీవ, టైలర్ గంగాధర్, లక్ష్మీ నారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నాయకులు

పరిగిలో ఎంపీపీ మార్పుపై తర్జనభర్జన

డైలమాలో వైసిపి నియోజకవర్గ నాయకులు

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండలంలో ఎంపీపీ మార్పు డ్రామా వైసిపి నాయకుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఎంపిపి మార్పు అంశాన్ని తెరపైకి తెస్తే తేనెటీగ తుట్టను కదిపినట్లు అవుతుందని ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అన్న డైలమాలో నియోజకవర్గ నాయకులు ఉన్నారు. పెనుగొండ నియోజకవర్గంలో పరిగి మండలం గతం నుండి టిడిపికి కంచుకోటగా ఉండేది. 2021లో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూల ఫలితాలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఎంపీపీ స్థానం బీసీ మహిళకు రిజర్వు కాగా ఆ స్థానం కోసం మండలంలో వైసిపికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు పోటీపడ్డారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన జయరాం, కురుబ సామాజిక వర్గానికి చెందన ప్రభాకర్ మద్దతుదారులను ఎంపిపి చేయాలని పోటీపడ్డారు. అయితే గతం నుండి వైసీపీ గెలుపు కోసం పనిచేసిన పైడేటి సీనియర్ నాయకుడు ప్రభాకర్ భార్య సవిత ప్రభాకర్‌ను రెండున్నర సంవత్సరాలు ఎంపీపీ గా కొనసాగించాలని ఆ తరువాత రెండున్నర సంవత్సరం జయరాం దగ్గరి బంధువైన సిగుపల్లి ఎంపిటీసీ శకుంతలమ్మను ఎంపిపి చేయాలని అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఎంపీపీగా సవిత ప్రభాకర్ కొనసాగారు. అయితే ఆమె బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాల కావస్తున్నా వైసిపి నియోజకవర్గ నాయకులు పట్టించుకోకపోవడంతో తనకు ఇచ్చిన మాట ప్రకారం తన సమీప బంధువును ఎంపీపీగా ప్రకటించాలని మాజీ కన్వీనర్ జయరాం మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల ఊటకూరు పంచాయతీల పర్యటనకు వచ్చిన ఉష శ్రీ చరణ్‌తో చర్చిస్తే ఆమె దాటవేత ధోరణి అవలంభించినట్లు జయరాం భావించారు. ఇప్పటికే ఎన్నికల ముందు పార్టీ కోసం పనిచేసిన నాయకులు కార్యకర్తలు అంటి ముట్టనట్లు ఉండటం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో పార్టీ క్యాడర్ నిరుత్సాహంలో ఉంది. ఈ నేపథ్యంలో మండలంలో ఎంపీపీని మారిస్తే ఎలాంటి పరిస్థితులను పార్టీ ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న టెన్షన్ వైసిపి నాయకులు కార్యకర్తల్లో ఉంది. మండలంలో ఎంపీపీ మార్పు జరిగితే వచ్చే పరిణామాలను టిడిపి తనకు అనుకూలంగా మార్చుకుంటుందా అన్న ఆందోళన వారిలో నెలకొంంది. ఇప్పటికే టిడిపి ఎంపిపి స్థానంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే బీచిగానిపల్లి, కొడిగేనహళ్లి ఎంపిటీసీల మద్దతు తీసుకని ఎంపీపీ స్థానం దక్కించుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే పరిగి మండలంలో ఎంపీపీ మార్పు ఏ మేరకు జరుగుతుందో! ఇచ్చిన మాట ప్రకారం మాజీ మంత్రి వైఖరి ఎలా ఉంటుందా అన్న ఆత్రుత మండల ప్రజల్లో నెలకొంది.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహాలు అందిస్తోందని ఇటీవల ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల విరివిగా పండ్ల తోటల పెంపకం సాగిస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పండ్ల తోటల సాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

జ : అతివృష్టి అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగుకు ఆసక్తి చూపే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. పంట రకాన్ని బట్టి మొక్కల కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చులను మూడు నుంచి రెండేళ్లపాటు భరించనుంది. ఐదు ఎకరాల లోపు నీటి వసతి ఉన్న రైతులకు గతంలో లబ్ధి పొందని వారందరూ ఈ పథకానికి అర్హులు. సాధారణ పంట తోటలతో పాటు గులాబీ, మల్లె, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి 18 రకాల పండ్ల మొక్కలు పెంచేలా కార్యాచరణ రూపొందించింది.

ప్రశ్న : పండ్ల తోటలో పెంపకానికి ప్రభుత్వం నిర్వహణకు ఏయే ఖర్చులు ఇస్తోంది.?

జ : ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు మొక్కల కొనుగోలు, రవాణా, గుంతలు తీయడం మొక్కలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చులు ప్రభుత్వం ఇస్తుంది. ఒక్క మొక్క సంరక్షణకు రూ.4.25ల చొప్పున వంద మొక్కలకు రూ.425 ఇలా నెలకు నాలుగు విడతలుగా కలిసి మాస్టర్ల రూపంలో రూ.1700లు రైతులకు అందిస్తుంది. పాదులు తీసి నీరు పెట్టేందుకు మరో రూ.3500 ఇవ్వనుంది. ఇలా మొత్తం రూ. 5, 200 వరకు రైతు పొందవచ్చు. ఎరువులకు ఆరు నెలలకు ఒకసారి 3వేల రూపాయలు ఇస్తుంది. నిర్వహణ ఖర్చుల కింద ఉపాధి పని దినాలను బట్టి మూడేళ్లపాటు చెల్లిస్తుంది. మామిడికి మొదటి ఏడాది రూ.4,521, రెండవ ఏడాది రూ.29,926 మూడో ఏడాది రూ. 27,986 మూడేళ్లకు మొత్తం రూ.1,03,193లు ప్రభుత్వం చెల్లిస్తుంది. మునగ, పూల తోటలకు రెండు సంవత్సరాలు, మిగిలిన పండ్ల మొక్కలకు మూడు సంవత్సరాలు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుంది. వీటికి తోడు సబ్సిడీ ధరలకు స్ప్రింకర్లు, స్ప్రేయర్లు, పైపులు ,డ్రమ్ములు, పాథలిన్ పట్టలు, రైతులకు అందిస్తున్నాం.

3) పండ్ల తోటల పెంపకానికి వర్షాకాలం అనుకూలమా.?

జ: వర్షాకాలం పండ్ల మొక్కల పెంపకానికి ఎంతో అనుకూలం. ఇప్పుడు నాటితే వందశాతం మొక్కలు బతుకుతాయి. రైతులకు దాదాపు ఆరు నెలలు నీటిని అందించే శ్రమ ఉండదు. నాటిన ప్రతి మొక్క బతుకుతుంది. మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మల్లె, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కలు నాటేందుకు అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న రైతులు ఆయా మండలాల్లోని ఉపాధి పథకం ఏపీవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

4) పండ్ల తోటలు నష్టపోతే ఎంత నష్టపరిహారం అందిస్తారు.?

జ : సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 -23 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 25 ఎకరాలలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంటనష్టం జరిగింది. అత్యధికంగా కాయగూరల పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు అరటికి రూ.25 వేలు. మామిడికి ఎకరాకు నూ. 20 వేలు, కొత్తిమీర పంటకు రూ. 7,200లు నష్టపరిహారం రైతులకు అందిస్తాం.

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారు.?

జ : పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత ఐదు సంవత్సరాల నుండి ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం.

నేడు పాఠశాలలకు సెలవు : డిఇఒ

కొత్తచెరువు రూరల్ : జిల్లాలో సోమవారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డిఇఒ మీనాక్షి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సెలవు మంజూరు చేశామని, ఈ విషయాన్ని అన్ని పాఠశాలల హెచ్ఎంలకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ రామ, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు పంపినట్లు ఆమె తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థల పాఠశాలలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యం : మైన్స్ ఏడీ

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యమవుతోందని టన్ను రూ. 277 అని, అవసరమైన వారు తీసుకు వెళ్లవచ్చని జిల్లా మైన్స్ ఏడీ రామ్మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇసుక నిల్వలు ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఉన్నాయన్నారు. కొడవాండ్లపల్లి డిపో వద్ద 5,168 టన్నులు, ఉప్పలపాడు వద్ద 666 టన్నులు, నల్లబోయనపల్లి డిపోలో 9,435 టన్నుల ఇసుక నిల్వలు ఉందన్నారు. నల్లబోయనపల్లి డిపోలో ప్రభుత్వ పనులకు కోసం ఇసుక నిల్వ చేశామన్నారు. మిగతా డిపోల్లో ప్రజలకు అవసరమైన ఇసుకను వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

పుట్టపర్తి రూరల్ : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ మంజువాణి తెలిపారు. ఆమె ప్రజలకు పలు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ నీటిని కాచి వడపోసి చల్లారిన తర్వాత మాత్రమే తాగాలన్నారు. ఎప్పటికప్పుడు తయారు చేసిన ఆహార పదార్థాలను మాత్రమే తినాలన్నారు. వండిన పాత్రలపై శుభ్రమైన మూతలు మూసి ఉంచి తర్వాత భుజించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు, ఈగలు, క్రిమి కీటక నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే వెంటనే సమీపంలోని పిహెచ్‌సి, ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యసేవలు పొంది ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

పుట్టపర్తి తహశీల్దార్‌కు ఆర్‌డిఒగా ఉద్యోగోన్నతి

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి తహశీల్దార్ అనుపమ ఆర్‌డిఒగా ఉద్యోగోన్నతి పొందారు. ఆమె గతంలో శ్రీసత్యసాయి జిల్లా, కర్నూలు జిల్లాలో కలెక్టరేట్‌లలో విధులు నిర్వహించారు. ఇటీవల బదిలీపై పుట్టపర్తి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఉద్యోగోన్నతి రావడం పట్ల తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆమె జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వృత్తి పట్ల మక్కువ, విధుల పట్ల ఎంత నిబద్ధతతో ఉన్నానో ఆర్‌డిఒగా కూడా ప్రజలకు మరింత చేరువై సేవలందిస్తానని అనుపమ తెలిపారు.

అనుపమ

ఎమ్మెల్యే, మాజీ మంత్రిని కలిసిన నూతన కమిషనర్

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి నూతన కమిషనర్ ప్రహ్లాద ఆదివారం అనంతపురం నగరంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి కమిషనర్‌గా వచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకుల సహకారంతో పుట్టపర్తి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మాజీ మంత్రి పల్లెకు పూలబొకే ఇస్తున్న కమిషనర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

'సత్యసాయి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

శ్రీసత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం శ్రీసత్యసాయి వాటర్ వర్కర్స్ పది రోజుల నుంచి వివిధ రూపాలలో నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని సత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, మహబూబ్‌బాషా, నాగప్ప, రెడ్డెప్పరెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కదిరి అర్బన్ : నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసం పరితపించే డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఎన్జీవో హోంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు అరుణ, రాము, బాలాజీ, మహేష్, లోకేష్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిస్వార్థ సేవకుడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో 'పవన్ కళ్యాణ్ కామన్ మ్యాన్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ అభిమానుల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హరిప్రసాద్, దినేష్, వెంకటేష్, నాగేంద్ర, గుంత ప్రతాప్, వెలగ నాగరాజు, శివ, షేక్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

కదిరి టౌన్ : డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ ఇన్‌చార్జి భైరవ ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జనసేనపార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని మాధవ గురుకులంలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి, అనంతరం మొక్కలు నాటుతామన్నారు. అనంతరం పట్టణంలోని జీవిమాను సర్కిల్ వద్ద అల్పాహార వితరణ, ఆర్ అండ్ బి బంగ్లాలో మొక్కలు నాటే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సిఎం చంద్రబాబుని కలిసిన సినీ నిర్మాత సంతోష్

కొత్తచెరువు : మాజీ జెడ్పిటిసి తనయుడు, సినీ నిర్మాత చిన్నపొల్ల సంతోష్ ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం చంద్రబాబు నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. సంతోష్ మాట్లాడుతూ 1995 సెప్టెంబర్ 1వ తేదీ మొదటిసారిగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారన్నారు. 30 ఏళ్ల పూర్వయిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు.


సిఎం చంద్రబాబుతో సంతోష్

వైసిపిపై బెంగళూరు టిడిపి ఫోరం పోరాటం భేష్

ఫోరం నవశకం సభలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్మోన్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై బెంగళూరు టిడిపి ఫోరం చేసిన పోరాటం అనిర్వచనీయమని మంత్రి సవిత తెలిపారు. ప్రజలంతా వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలని చేనేత పరిశ్రమను బతికించాలని పిలుపునిచ్చారు. బెంగళూరు నగరంలో ఆదివారం బెంగళూరు టిడిపి ఫోరం నవశకం సభ నిర్వహించగా ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. బెంగళూరు టిడిపి ఫోరం రాజకీయాలే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. ఎన్నికల్లో తన విజయానికి దోహదం చేశారన్నారు. దోచుకోవడం.. దాచుకోవడమే లక్ష్యంగా జగన్ పాలించారని మండిపడ్డారు. టిడిపి శ్రేణులను తప్పుడు కేసులతో వేధించి జైలులో పెట్టారని ధ్వజమెత్తారు. మద్యం, మైనింగ్, భూ కబ్జాలు, దందాలతో రాష్ట్ర సంపదను లూటీ చేశారని ఆరోపించారు. 2014–19 మధ్య చంద్రబాబు అమలు చేసిన పథకాలన్నింటినీ రద్దు చేయడంతో పాటు చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేశారన్నారు. అలాంటి రాక్షస పాలనను భరించలేక ప్రజలంతా మూకుమ్మడిగా ఎన్నికల్లో కూటమికి జై కొట్టారన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా సిఎం చంద్రబాబు మొదటి నెల నుంచే పింఛను మొత్తం పెంచారని, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అలిమినేని సురేంద్రబాబు, నాయకులు డాక్టర్ సురేశ్, రావి రామ్మోహన్‌చౌదరి, బి.గోపాల్, చెన్నై టిడిపి ఫోరం సభ్యులు చంద్రశేఖర్, బెంగళూరు ఫోరం సభ్యులు, పాల్గొన్నారు.

బెంగళూరులో నిర్వహించిన నవ శకం సభలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి : ఎస్‌టియు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్రంలో అమలవుతున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, భవిష్యత్తుకు భరోసా లేని సిపిఎస్‌ను రద్దు చేయాలని రెండు దశాబ్దాలుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీలే తప్ప అమలు చేయలేదన్నారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని భిక్ష కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు, ప్రసాద్, జవహర్, లక్ష్మీప్రసాద్, సంపత్‌కుమార్, కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేయాలని, ఇతర ఏ స్కీం వద్దని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్ డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యుపిఎస్)ను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. యుపిఎస్ అమలు వల్ల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అదనంగా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సిపిఎస్, జిపిఎస్ లను ప్రభుత్వం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, ఎన్‌సి. సోమశేఖర్‌నాయక్, వెంకటచలమయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఎస్‌టియు నాయకులు

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సిడబ్ల్యూసి మెంబర్, మాజీమంత్రి రఘువీరారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్ట వేడుకలు, విద్యార్థుల ప్రతిభా పురస్కారాల మహోత్సవ కార్యక్రమానికి వారు హాజరై ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ జపానంద స్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, యాదవ ఎడ్యుకేషనల్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ చిక్కపయ్య, రాయల్ మురళి, రాధాకృష్ణ, మద్దనకుంటప్ప, సన్నతిమ్మప్ప, జికె.ఈరన్న, యువ నాయకుడు ఆనంద్, చిక్కన్న దేవరాజ్, గిరి, శ్రీనాథ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజును సన్మానిస్తున్న, గుండుమల తిప్పేస్వామి, రఘువీరా

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తయిన(స్వర్ణోత్సవ సంబరాలు) సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ మడకశిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం పట్టణంలోని సిఐ కార్యాలయం వద్ద సిఐ కె.రాఘవ చేత బ్యానర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పురుష ఉపాధ్యాయులకు బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, 100, 200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్, జవెలిన్ త్రో, క్యారమ్స్, తదితర వాటిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు, టోర్నమెంట్ కన్వీనర్ కె.భూతన్న, సీనియర్ యుటిఎఫ్ నాయకులు ఈ.నారా యణస్వామి, ఎంకె.నబి, కృష్ణానాయక్, రవీంద్రనాథ్, గోవిందప్ప, నరసింహులు, తహీర్ వలి, హరికృష్ణ తెలిపారు.

యుటిఎఫ్ క్రీడా పోటీల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ రాఘవ

కరాటేలో సాధించిన బెల్ట్‌లతో విద్యార్థులు

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ అక్బర్‌అలీ తెలిపారు. పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో ఆదివారం కియో జపాన్ షోటోఖాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పోటీలు నిర్వహించారు. అందులో 17 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటగా కరాటే జిల్లా ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ చే ధ్రువీకరణ పత్రాలు, బెల్టులు అందజేశారు. బద్రి, ప్రకాశ్, సాయికార్తీక్, మోక్షిత్ సాయి, ఇషిత ఎల్లో బెల్ట్, హనిక, భవ్య, మానస, లోక్షిత, సుజిత్, ఉమర్ ఆరెంజ్ బెల్ట్, మెష్వాద్, ఫైజా గ్రీన్ బెల్ట్, మహమ్మద్ అసద్ పర్పుల్ బెల్ట్, దీక్షిత్, సనత్ బ్రౌన్ బెల్ట్ సాధించారు. మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం క్రమ శిక్షణగా కరాటే సాధన చేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటార న్నారు. కరాటే ఎస్‌జిఎఫ్ టోర్నమెంట్స్‌లో గెలిచే సర్టిఫికెట్ ద్వారా స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ కూడా ఉంటుందన్నారు. కరాటే, బాక్సింగ్, జూడో లాంటి క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ మహమ్మద్ రఫీక్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

గణేశ్ ఉత్సవాల్లో భాగంగా విగ్రహం ఏర్పాటు చేసే ఉత్సవ సమితి సభ్యులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగేలా రోడ్లపై విగ్రహం ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రయివేట్ స్థలంలో గానీ, పంచాయతీ స్థలంలో కానీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆ స్థలం యజమానితో అనుమతి తీసుకోవాలన్నారు. వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసే ముందు ఓ కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ సభ్యుల పేర్లను స్టేషన్లో ఇవ్వాల్సి ఉంటుంద న్నారు. మండపాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ లౌడ్ స్పీకర్ ఏర్పాటు చేసుకోవడా నికి చుట్టు పక్కల నివసించే వారి నుంచి సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, నిమజ్జనం తేదీ, సమయం, ఊరేగింపు, వాహనం, నిమజ్జన స్థలం, తదితర వివరాలు ముందుగానే తెలపాలన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా విగ్రహం తరలించాలన్నారు. ఊరేగింపులో డిజె వాడకూడ దన్నారు. కులమతాలను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయకూడదని, ట్రాక్టర్లలో చిన్న పిల్లలను ఎక్కించుకోకూడదని, మద్యం తాగి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

గాండ్లపెంట : మండలంలో సిరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సయ్యద్ ఇమామ్ సాబ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కదిరి పట్టణంలోని పట్టు గూళ్ల పరిశ్రమలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బి.పద్మమ్మ, అసిస్టెంట్ సంచాలకులు గీత సయ్యద్ ఇమామ్‌సాబ్‌ను పూలమాలలు, శాలు వాలతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అసిస్టెంట్ అధికారి రామకృష్ణ, మస్తాన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నీరుకుంట్లపల్లి లో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మడక రుక్మాంగధను ఎంఇఒలు బి.కష్ణానాయక్, శ్రీనివాసులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలి, అప్పిరెడ్డి, బాషా, జి.రామ్మోహన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ సాబ్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

గుడిబండ : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.నాగ రాజు, సన్న లింగప్పను, అధ్యక్షులుగా ఎ.షబ్బీర్ , కార్యదర్శిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా రంగనాథ్, కోశాధికారిగా సురేష్, గౌరవ సలహాదారులుగా రాజ్‌కుమార్, బిహెచ్. రాయుడు, సహాయ కార్యదర్శులుగా తిప్పేస్వామి, రంగధామప్ప, ఈసీ మెంబర్లుగా హనుమంతనాయుడు, శివరాజును ఎన్నుకున్నారు. షబ్బీర్, తిమ్మప్ప, సన్నలింగప్పలను సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన పాత్రికేయులు

టిడిపి ఆధ్వర్యంలో అన్నదానం

గోరంట్ల : టిడిపి నాయకుడు పచ్చ అశోక్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని బస్టాండ్‌లో 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పచ్చ అశోక్‌కు టిడిపి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి పూలబొకేలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, గుమ్మయ్యగారిపల్లి హరి, సోమశేఖర్, అజ్మతుల్లా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

ఘర్షణలో తొమ్మిది మందికి గాయాలు

బత్తలపల్లి : ప్రేమ వివాహం చేసుకుని అత్తింట్లో ఉంటున్న కుమారుడు ఇంటికి రావడం లేదనే విషయంపై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 9 మంది గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివ రాలు.. మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణ కుమార్తె సంధ్య, ధర్మవరం రూరల్ మండలంలోని బడన్నపల్లికి చెందిన ఓబులేసు కుమారుడు ఆకాష్ రెండు నెలల క్రితం పెద్దల ప్రమేయం' లేకుండా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరు పెళ్లి చేసుకున్న తరువాత బడన్నపల్లి గ్రామానికి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో శనివారం చిన్నపాటి గొడవ జరిగింది. తరువాత ఆదివారం గ్రామంలో బంధువుల ఇంటి వద్ద ఓబులేసు వర్గీయులు ఉండగా సూర్యనారాయణ వర్గీయులు వెళ్లి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో సూర్యనారాయణ వర్గీయుల్లో ఓబులేసు, లక్ష్మి, ఆకాష్, శివశంకర్‌కు గాయాలయ్యాయి. ఓబులేసు వర్గీయుల్లో ఓబులేసు, చిన్న వీరప్ప, పెద్ద వీరప్ప, నాగరత్న, పెద్దక్కలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్‌డిటి ఆసు పత్రి, ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చోరీ అయిన కారు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

ముదిగుబ్బ : స్థానిక సాయినగర్‌లో వారం రోజుల క్రితం చోరీకి గురైన కారును స్వాధీనం చేసుకొని, దానికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఆదివారం పట్టణ సిఐ యతీంద్ర తెలిపారు. వివరాలు.. సాయినగర్‌లోని పాత పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన విజయసింహ తన కారును ఇంటి ముందు నిలిపి ఉండగా గత బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టి నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. వాహనం వెళ్లిన రహదారిని గుర్తించడానికి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి, పలుచోట్ల గాలింపులు చేపట్టి అనుమానితుల కదలికల పై నిఘా ఉంచామన్నారు. అందిన సమాచారం మేరకు శనివారం పట్టణ శివారులోని దొరిగిల్లు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద చోరీకి గురైన కారుతో పాటుచ నిందితులు బాబ్‌జాన్, సురేష్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

గుండెపోటుతో విద్యుత్ లైన్‌మెన్ మృతి

అమరాపురం : అమరాపురంలో విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న నాగరాజు శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆదివారం నాగరాజు స్వగ్రామం చిట్నడుకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సర్పంచి వాగేష్, స్థానిక టిడిపి నాయకులు కెంచప్ప, నాగభూషణ్ నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి మాట్లాడుతూ నాగరాజు లైన్‌మెన్‌గా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. వీరితో పాటు స్వారక్క నరసింహమూర్తి, నారాయణప్ప, ఆటో తిప్పయ్య, ప్రసాద్, ఎంజేరప్ప, తదితరులు నివాళులర్పించారు.

ఆవు ప్రాణాలు కాపాడిన పశు వైద్యాధికారి

తనకల్లు : మండలంలోని ముండ్లవారిపల్లి గ్రామంలో శనివారం రాత్రి తవళం పశు వైద్యాధికారి డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఎంతో శ్రమకోర్చి ఆవు ప్రాణాలు కాపాడాడు. జెర్సీ ఆవు పురిటి నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా రైతు పశు వైద్యాధికారి వద్దకు వెళ్లి విషయాన్ని తెలిపారు. స్పందించిన వైద్యుడు అర్ధ రాత్రి వేళ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఆవు కడుపులోనే చనిపోయిన దూడను చాలా సేపు శ్రమించి బయటకు తీసి ఆవు ప్రాణాలు కాపాడాడు. డాక్టర్ సేవలను గ్రామస్తులు అభినందించారు. 24 గంటలూ అందుబాటులో ఉంటానని, పశువులకు ఏ సమస్య ఉన్నా సంప్రదించాలని డాక్టర్ తెలిపారు.

పెనుకొండ సిఐని కలిసిన మండల నాయకులు

రొద్దం : పెనుకొండ సిఐ రాఘవన్‌ను ఆదివారం మండల నాయకులు పోలీస్‌స్టేషన్‌లో మర్యాపూర్వంకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలపారు. సిఐని కలిసిన వారిలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మాజీ జడ్పీటీసీ ఈ.చిన్నప్పయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు టైలర్ ఆంజనేయులు, టిడిపి జిల్లా బిసి సెల్ కార్యదర్శి ఎన్.వీరాంజనేయులు, వాల్మీకి చంద్రశేఖర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : సిఐ

ముదిగుబ్బ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సిఐ శ్యామ్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సిఐ శ్యామ్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు, ఇంటర్నేషనల్ యోగా గురు రాఘవేంద్రరాజు, పోలీసు సిబ్బంది, పాత్రికేయులు మొక్కలు నాటారు. రూరల్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా చెట్ల నరికినా, తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నితీష్‌చౌదరి, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

సిఐకు నాయకుల సన్మానం

స్థానిక సర్కిల్ కార్యాలయంలో సిఐ శ్యామ్‌రావును బిజెపి నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. సిఐని కలిసిన వారిలో మండల అధ్యక్షులు సోమల ప్రకాష్‌నాయుడు, పసుపులేటి వెంకటేష్, నాగభూషణ, ఫణీంద్రగౌడ్, కందుకూరు బాబు, హనీఫ్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎఇ శివయ్య ప్రజలకు సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆదివారం ఆయన వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తడిసిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. తడిచిన చేతులతో ఎలాంటి విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ సమస్య ఉంటే జెఎల్‌ఎం, ఎఎల్‌ఎం, ఎల్‌ఎం దృష్టికి తీసుకురావాలని ఎఇ ప్రజలకు సూచించారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

గోరంట్ల : మండలంలోని కసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం టిడిపి మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ చంద్ర బాబు తొలిసారి 1995 సెప్టెంబర్ 1వ తేదీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశార న్నారు. 30 ఏళ్లు పూర్తవడంతో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని సత్యమ్మ కూడలిలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామప్ప, భీమనేని కృష్ణప్ప, బేకరీ నాయుడు, జనార్ధన్, పోతన్న, నారాయణప్ప, కేతప్ప, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని సత్యమ్మ దేవత సన్నిధిలో టిడిపి నాయకులు సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బుట్టి నాగభూషణంనాయుడు, హనుమంతరెడ్డి, ఎస్‌డి.గంగరాజు, వడిత్య మహేంద్ర నాయక్, ఎం.రవి, డ్రైవర్ అంజి, సి.నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలు

కదిరి అర్బన్ : ఎమ్మెల్యే బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అభిమానులు ఆదివారం పట్టణంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్ నాయుడు, గంగయ్య, డైమండ్ ఇర్ఫాన్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బి.నాగేంద్ర, విశ్వనాథరెడ్డి, శ్రీనివాస్, నాగరాజుయాదవ్, రఫీ, పవన్, హరీష్, నరేష్, శ్రీనివాసులు, ఆదినారాయణ, రాహంతుల్లా, రాజు, పవన్‌కుమార్, కృష్ణమూర్తి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న బాలయ్య అభిమానులు